## టీబీజీకేఎస్‌ను గెలిపించండి : మాజీ ఎమ్మెల్యే వనమా



వనమా సమక్షంలో టీబీజీకేఎస్‌లో చేరుతున్న సంపత్‌కుమార్

కొత్తగూడెం సింగరేణి, డిసెంబర్ 25: సింగరేణి గుర్తింపు సంఘం ఎన్నికల్లో కార్మికులు తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం (టీబీజీకేఎస్) గుర్తు అయిన బాణం గుర్తుపై ఓట్లు వేసి గెలిపించాలని మాజీ ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. రామవరంలోని టీబీజీకేఎస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే సింగరేణికి పూర్వవైభవం వచ్చిందన్నారు. జాతీయ కార్మిక సంఘాలు పోగొట్టిన వారసత్వ ఉద్యోగాలను టీబీజీకేఎస్ తిరిగి తీసుకొచ్చిందన్నారు. టీబీజీకేఎస్‌ను గెలిపిస్తే ప్రతి కార్మికుడికి 250 గజాల స్థలంతో పాటు రూ.10 నుంచి 20 లక్షల వరకు వడ్డీలేని రుణం ఇప్పిస్తామన్నారు. డిపెండెంట్ ఉద్యోగ వయస్సును 35 –40 సంవత్సరాలకు పెంచుతామని, విజిలెన్స్ డిపార్ట్‌మెంట్‌లో పెండింగ్‌లో ఉన్న డిపోనెంట్‌లకు నిర్ణీత సమయంలో ఉద్యోగాలు ఇప్పిస్తామన్నారు. వనమా అనంతరం టీబీజీకేఎస్‌లో చేరిన మాజీ యూనియన్ నాయకుడు సంపత్‌కుమార్‌ను సంఘంలోకి ఆహ్వానించారు. సమావేశంలో మున్సిపల్ చైర్‌పర్సన్ కాపు సీతాలక్ష్మి, వైస్ చైర్మన్ దామోదర్ చుంచుపల్లి ఎంపీపీ బదావత్ శాంతి, సొసైటీ చైర్మన్ మండె వీరహన్మంతరావు, 11మెన్ కమిటీ మెంబర్ కాపు కృష్ణ, టీబీజీకేఎస్ నాయకులు కూసన వీరభద్రం, రాజయ్య, మోరె రమేష్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

## 'ప్రజాపాలన'కు ఏర్పాట్లు చేయాలి: భద్రాద్రి కలెక్టర్



భద్రాద్రి కొత్తగూడెం, డిసెంబర్ 25 (నమస్తే తెలంగాణ): ఈ నెల 28 నుంచి జనవరి 6 వరకు 'ప్రజాపాలన' కార్యక్రమ నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేయాలని భద్రాద్రి కలెక్టర్ డాక్టర్ ప్రియాంక ఆల సూచించారు. 'ప్రజాపాలన' కార్యక్రమం నిర్వహణపై జిల్లా, నియోజకవర్గ, మండల అధికారులతో సోమవారం నిర్వహించిన టెలీకాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. కార్యక్రమం నిర్వహణపై 26న మంగళవారం రాష్ట్ర రోడ్లు, భవనాలు శాఖ మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఖమ్మం కలెక్టరేట్‌లో సమావేశం నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ సమావేశానికి నిర్దేశించిన అధికారులు హాజరుకావాలని సూచించారు. ఈ నెల 28 నుంచి జనవరి 6 వరకు నిర్వహించనున్న 'ప్రజాపాలన' కార్యక్రమం నిర్వహణపై ఉమ్మడి జిల్లా సన్నాహక సమావేశం మంగళవారం ఖమ్మం కలెక్టరేట్‌లో నిర్వహించనున్నట్లు చెప్పారు. జిల్లా అధికారులు హాజరుకావాలని సూచించారు. ఈ సమావేశంలో 'ప్రజాపాలన' కార్యక్రమ నిర్వహణపై మ ంత్రి అవగాహన కల్పిస్తారని అన్నారు. ప్రతీ రోజూ రెండు షిఫ్టుల్లో గ్రామసభలు నిర్వహించాల్సి ఉంటుందన్నారు. ప్రభుత్వ సెలవు దినాలైన డిసెంబర్ 31, జనవరి 1 మినహాయించి మిగతా రోజుల్లో కార్యక్రమం షెడ్యూల్ ప్రకారమే నిర్వహించాల్సి ఉంటుందని అన్నారు. టెలీ కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్లు రాంబాబు, మధుసూదన్‌రాజు, డీపీవో రమాకాంత్, జడ్పీ సీఈవో విద్యాలత పాల్గొన్నారు.

## సింగరేణి గుర్తింపు ఎన్నికలకు సర్వం సిద్ధం

### రేపు బ్యాలెట్ పద్ధతిలో ఎన్నికల నిర్వహణ

కొత్తగూడెం సింగరేణి, డిసెంబర్ 25: సింగరేణి సంస్థలో గుర్తింపు సంఘం ఎన్నికల కోసం సర్వం సిద్ధమైంది. ఈ నెల 27న బుధవారం కేంద్ర కార్మిక శాఖ ఆధ్వర్యంలో రహస్య బ్యాలెట్ పద్ధతిలో ఈ ఎన్నికలు జరుగనున్నాయి. మొత్తం అన్ని ఏరియాల్లో 39,773 మంది ఉద్యోగులు తమ ఓటుహక్కును వినియోగించుకునోనున్నారు. మొత్తం 13 యూనియన్లు ఎన్నికల్లో పోటీ పడుతున్నాయి. ఎన్నికల ప్రక్రియకు సంబంధించిన ఏర్పాట్లు పూర్తయ్యాయి. కేంద్ర కార్మిక శాఖ గుర్తించిన విధంగా కంపెనీలోని 11 ఏరియాల్లో 84 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. అన్ని పోలింగ్ కేంద్రాల్లోనూ 27న ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ జరుగనుంది. పోలింగ్ ముగిసిన తర్వాత ఓట్ల లెక్కింపు కార్యక్రమం జరుగనుంది. అనంతరం ఫలితాలు వెల్లడించనున్నారు.

## ముత్యాలమ్మకు ముక్కుపుడక బహూకరణ

సారపాక, డిసెంబర్ 25: సారపాకలోని ముత్యాలమ్మపేటలోని ముత్యాలమ్మ అమ్మవారికి సారపాకకు చెందిన మేకా రామిరెడ్డి, రమ దంపతులు రూ.60వేల విలువైన బంగారు ముక్కుపుడకను సోమవారం ఆలయ కమిటీ నిర్వాహకులకు అందజేశారు. కార్యక్రమంలో ఆలయకమిటీ సభ్యులు, అర్చకులు పాల్గొన్నారు.

## భవానీ, అయ్యప్ప మాలధారులకు అన్నదానం

పాల్వంచ, డిసెంబర్ 25: పాల్వంచ పట్టణంలోని బాపూజీనగర్ ప్రసన్నాంజనేయ స్వామి ఆలయంలో సోమవారం స్వామివారికి అర్చకులు దినకరశాస్త్రి, పార్థసారథిశాస్త్రి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం దాత గంట్యారు శ్రీనివాసరావు 2,500 మంది భవాని మాలధారులు, అయ్యప్ప మాలధారులు, భక్తులకు అన్న సంతర్పణ చేశారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ వైస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు గురుస్వామి గొర్ల నరేశ్ పాల్గొన్నారు.

## భద్రాద్రి రామయ్యకు ముత్తంగి అలంకరణ

భద్రాచలం, డిసెంబర్ 25: భద్రాద్రి దివ్యక్షేత్రంలో సోమవారం అంతరాలయంలోని మూలవరులకు బెంగళూరు భక్తులు రూ. 30లక్షలతో తయారు చేయించి, సమర్పించిన ముత్యాలు పొదిగిన ప్రత్యేక తొడుగులను అర్చకులు ధరింపజేశారు. తెల్లవారుజామున ఆలయ తలుపులు తెరిచి శ్రీవారికి సుప్రభాత సేవ, ఆరాధన నిర్వహించారు. అనంతరం స్వామివారి నిత్య కల్యాణ మూర్తులను బేడా మండపానికి తీసుకొచ్చి శాస్త్రోక్తంగా నిత్య కల్యాణం జరిపారు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్ Classifieds

ఒరిజినల్ డాక్యుమెంట్ పోయినది

నేను షేక్ పెద్ద మస్తాన్ S/o. షేక్ జమాల్ సాహెబ్, R/o. H.No.14-3-152/3, జయనగర్ కాలనీ, బల్లేపల్లి దగ్గర, ఖమ్మం, ఖమ్మం జిల్లా, నేను ది.05.10.2022 నాడు గుంటూరు నుండి బల్లేపల్లికి వచ్చి అక్కడి నుండి మా తమ్ముడి ఇంటికి ఆటోలో వెళ్తుండగా మార్గ మధ్యలో నా ఖాళీ స్థలానికి సంబంధించిన సేల్ డీడ్ (Doc No.14603 /1984, Date : 19.12.1987) పోయినది. దొరికిన వారు పై అడ్రస్‌కు అందచేయగలరు. ఇట్లు : షేక్ పెద్దమస్తాన్.
Cell : 9177398435

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లైయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

## హమాలీ రేట్లు 17 శాతం పెంపు

పాల్వంచ, డిసెంబర్ 25: హమాలీ రేట్లు పెంచాలని హమాలీ ట్రేడ్ యూనియన్ నాయకులు రెండు నెలల నుంచి వ్యాపారస్తులతో చర్చోపచర్చలు సాగిస్తున్నారు. ఈ చర్చలు సోమవారం సఫలమయ్యాయి. ఇప్పటివరకు అమలవుతున్న రేట్లలో 14 శాతం, బోనస్ 3శాతం కలిపి మొత్తంగా 17 శాతానికి పెంచేందుకు చాంబర్ ఆఫ్ కామర్స్ అంగీకారం తెలిపింది. చర్చల్లో చాంబర్ ఆఫ్ కామర్స్ బాధ్యులు పెండ్యాల కృష్ణ, చలువాది ప్రకాశ్, దాసరి రాము, విశ్వనాథం, పూర్ణ, ఉప్పుశెట్టి రాహుల్, నాగేశ్వరరావు, పాషా, దొడ్డ రవి, సత్య, చారి, చేరాలు, గట్టయ్య పాల్గొన్నారు

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ

నమస్తే తెలంగాణ దినపత్రికలో
చందా కొరకై మరియు పత్రికా పంపిణీలో
ఏమైన సమస్యలు ఉంటే సంప్రదించగలరు

సెల్ : 9182777073

నమస్తే తెలంగాణ దినపత్రికలో అన్ని రకాల
ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించగలరు

సెల్ : 9182777616

# సింగరేణి గుర్తింపు ఎన్నికల్లో
# కాంగ్రెస్, సీపీఐ నేతలు ఎవరికి వారే

- ఎన్నికల ప్రచారంలో రెండు వర్గాల మధ్య రగడ
- కొత్తగూడెంలోని సింగరేణి హెడ్డాఫీస్ సాక్షిగా విభేదాలు



సింగరేణి ప్రధాన కార్యాలయం ఎదుట ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, ఏఐటీయూసీ నాయకుల ఆందోళన

భద్రాద్రి కొత్తగూడెం, డిసెంబర్ 25 (నమస్తే తెలంగాణ): సింగరేణి ఏరియాల్లో ఈనెల 27న జరుగనున్న గుర్తింపు సంఘం ఎన్నికలకు జాతీయ సంఘాలతోపాటు లోకల్ సంఘాలు జోరుగా ప్రచారం నిర్వహిస్తున్నాయి. బీఆర్ఎస్ అనుబంధ సంఘమైన టీబీజీకేస్ నాయకులు గనులు, వర్క్‌షాపుల వద్దకు వెళ్లి కార్మికులను ఓట్లు అభ్యర్థిస్తున్నారు. ఎన్నికల్లో గెలుపు కోసం ఎవరి పాట్లు వారు పడుతున్నారు. కానీ అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ అనుబంధ సంఘమైన ఐఎన్‌టీయూసీ, సీపీఐ అనుబంధ సంఘమైన ఏఐటీయూసీ కలిసి పనిచేసి ఇప్పుడు గుర్తింపు సంఘం ఎన్నికల్లో ఎవరికి వారే యమునా తీరే అన్నట్లుగా వేర్వేరుగా పోటీ చేస్తున్నాయి. ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం కొత్తగూడెంలోని సింగరేణి హెడ్డాఫీసులోకి ఐఎన్‌టీయూసీ, ఏఐటీయూసీ వెళ్లేందుకు యత్నించాయి. ఐఎన్‌టీయూసీ నాయకులు హెడ్డాఫీసులోకి వెళ్లిపోగా ఏఐటీయూసీ నాయకులు గేట్ బయటే ఉండిపోయారు. ఒక సంఘాన్ని లోపలికి పంపి మరొక సంఘాన్ని అనుమతించడ లేదని ఏఐటీయూసీ నాయకులు సెక్యూరిటీ సిబ్బందితో వాగ్వాదానికి దిగారు. మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి కొత్తగూడెం వస్తున్నారని, ఈ కారణంతోనే ఐఎన్‌టీయూసీ నాయకులను లోపలికి అనుమతించి, తమను అనుమతించడం లేదని ఏఐటీయూసీ నాయకులు ఆందోళనకు దిగారు. సమాచారం అందుకున్న కొత్తగూడెం ఎమ్మెల్యే, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు ఘటనా స్థలానికి వచ్చి ఆందోళన చేపట్టారు. విషయం తెలుసుకున్న సింగరేణి డైరెక్టర్ (పా) బలరాం అక్కడికి చేరుకుని ఆందోళనకారులకు సర్దిచెప్పారు. ఎమ్మెల్యే సాంబశివరావును లోపలికి అనుమతించారు. దీంతో గొడవ సద్దు మణిగింది. నిన్నమొన్నటి వరకు కలిసి ఉన్న కాంగ్రెస్, సీపీఐ నాయకుల మధ్య సింగరేణి గుర్తింపు సంఘం ఎన్నికల నేపథ్యంలో విభేదాలు బహిర్గతమయ్యాయి.



టీబీజీకేఎస్ నాయకుల అడ్డగింత

## పోలీసుల అత్యుత్సాహం

కొత్తగూడెం సింగరేణి, డిసెంబర్ 25: సింగరేణి పరిధిలో సోమవారం మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పర్యటన సందర్భంగా సంస్థ సెక్యూరిటీ అధికారులు, సిబ్బంది అత్యుత్సాహాన్ని ప్రదర్శించారు. సంస్థ హెడ్డాఫీస్‌లోకి ఐఎన్‌టీయూసీ నాయకుల ప్రచారాన్ని అనుమతించి ఇతర సంఘాలను అనుమతించలేదు. వారి లాగానే కొత్తగూడెం డీఎస్పీ రెహమాన్, పోలీస్ సిబ్బంది కూడా దురుసుగా ప్రవర్తించారు. ప్రచారానికి చివరి రోజు కావడంతో అన్ని సంఘాలూ లోపలికి వెళ్లేందుకు ప్రయత్నించగా ఆ ప్రయత్నాలు విఫలమయ్యాయి. ఇలా ముందు టీబీజీకేఎస్ నాయకులు వెనుదిరిగి వెళ్లగా తర్వాత అన్ని సంఘాలకూ నిరాశే ఎదురైంది. పోలీసులు మంత్రి మెప్పు పొందేందుకే పాత్రికేయులతోనూ దురుసుగా ప్రవర్తించారని పెదవి విరిచారు.

## రాపత్తు సేవలో ఎమ్మెల్యే వెంకట్రావు దంపతులు



పూజల్లో ఎమ్మెల్యే వెంకట్రావు దంపతులు

భద్రాచలం, డిసెంబర్ 25: భద్రాచలం సీతారామ చంద్రస్వామి దేవస్థానం నిర్వహిస్తున్న ముక్కోటి ఏకాదశి అధ్యయనోత్సవాల్లో భాగంగా సోమవారం రాపత్తు సేవను కృష్ణాలయంలో నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు దంపతులు పాల్గొన్నారు. వారికి రామాలయం విశ్రాంత ప్రధానార్చకుడు పొడిచేటి జగన్నాధాచార్యులు స్వాగతం పలికారు. స్వామిని ప్రత్యేక పల్లకిలో కృష్ణాలయానికి తీసుకొని వచ్చి విశ్వక్సేన ఆరాధన, కర్మణ పుణ్యాహావాచన జరిపి అష్టోత్తర శతనామార్చన చేశారు. అనంతరం ఉత్సవంలో పాల్గొన్న భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే దంపతులకు అర్చకులు శాలువాతో సత్కరించి, జాకెట్, కండువాలను అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు కోటగిరి ప్రబోధ్‌కుమార్, ఎండీ నవాబ్, తాళ్లపల్లి రమేశ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## కార్మికులను కంటికి రెప్పలా కాపాడుకుంటా

### మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి



ఉద్యోగులను ఓటు అభ్యర్థిస్తున్న మంత్రి పొంగులేటి

ఇల్లెందు రూరల్, డిసెంబర్ 25: ఉద్యోగులు, కార్మికులను ఇతర ప్రాంతాలకు బదిలీలు కాకుండా చూస్తానని, కార్మికులను కంటికి రెప్పలా కాపాడుకుంటానని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలోని జేకే ఓసీలో జరిగిన గేట్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. కార్మికులకు రూ.20 లక్షల వడ్డి లేని రుణాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తుందన్నారు. కారుణ్య నియామకాల కోసం ఉద్యోగానికి ఒక్క రూపాయి కుడా ఎవరికి ఇవ్వవద్దని పైసా ఖర్చు పెట్టుకుండా ఇప్పించే బాధ్యత నేనే తీసుకుంటానన్నారు. ఆనంతరం వివిధ యూనియన్లకు చెందిన కార్మికులు ఐఎన్‌టీయూసీలో చేరారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే కోరం కనకయ్య, మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు, ఐఎన్‌టీయూసీ నాయకులు గోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

### సింగరేణిని ప్రైవేట్‌పరం కానివ్వం

కొత్తగూడెం సింగరేణి, డిసెంబర్ 25: సింగరేణిని ప్రైవేట్‌పరం కానివ్వమని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచారశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. కొత్తగూడెంలోని సింగరేణి హెడ్డాఫీస్‌తోపాటు పీవీకే–5 షాఫ్ట్, జీఎం కార్యాలయం, ఏరియా వర్క్‌షాప్‌లో సోమవారం ఆయన ఐఎన్‌టీయూసీ నాయకులతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మెడికల్ బోర్డులో అక్రమాలకు తావు లేకుండా మెడికల్ బోర్డు విధానాన్ని మారుస్తామన్నారు. మంత్రి వెంట అశ్వారావుపేట ఎమ్మెల్యే ఆదినారాయణ, ఏరియా, కార్పొరేట్ ఐఎన్‌టీయూసీ నాయకులు పాల్గొన్నారు.

## 28 నుంచి ప్రజాపాలన సదస్సులు

అశ్వారావుపేట టౌన్, డిసెంబర్ 25: ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు 28నుంచి జనవరి 6 వరకు మండలంలోని పంచాయతీ కార్యాలయాల్లో ప్రజాపాలన సదస్సులు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ కృష్ణప్రసాద్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలో 182 కౌంటర్లు ఏర్పాట్లు చేశామని, ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

## ఆర్థిక సాయం

బూర్గంపహాడ్, డిసెంబర్ 25: మండలంలోని జింకలగూడెం గ్రామానికి చెందిన సయ్యద్ ఖాసీం అనారోగ్యంతో బాధపడుతుండగా విషయం తెలుసుకున్న మోరంపల్లిబంజరకు చెందిన నేస్తం వెల్ఫేర్ ట్రస్టు ఆధ్వర్యంలో బాధితుడికి రూ.6వేలు ట్రస్టు బాధ్యులు సోమవారం అందజేశారు.

## ఏడుగురిపై కేసు

పాల్వంచ రూరల్, డిసెంబర్ 25: ఒకే కుటుంబానికి చెందిన ఏడుగురిపై పాల్వంచ రూరల్ పోలీసు స్టేషన్‌లో సోమవారం కేసు నమోదైంది. పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని ఇల్లెందులపాడు తండాకు చెందిన కొర్రా సాయికిరణ్, పాండురంగాపురం తండాకు చెందిన పోతురాజు సృజన నాలుగు నెలల క్రితం ప్రేమ వివాహం చేసుకున్నారు. వివాహం ఇష్టం లేని సృజన కుటుంబ సభ్యులు సోమవారం సాయికిరణ్ ఇంటికి వెళ్లి అతడితోపాటు కుటుంబ సభ్యులపై దాడి చేశారు. సృజన ఫిర్యాదు మేరకు పోలీసులు సత్యవతి, నాగమణి, సీత, పవన్, ప్రశాంత్‌తోపాటు మరో ఇద్దరిపై కేసు నమోదు చేశారు.

## బాధితుడికి ఎల్‌వోసీ అందజేత

చంద్రుగొండ, డిసెంబర్ 25: మండలంలోని తిప్పనపల్లి గ్రామానికి చెందిన క్యాన్సర్ బాధితుడు గోరేమియాకు ప్రభుత్వం నుంచి మంజూరైన రూ.2లక్షల ఎల్‌వోసీ లెటర్‌ను అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ బాధితుడి ఇంటికెళ్లి సోమవారం అందజేశారు. ఆయన వెంట పంచాయితీ ఉప సర్పంచ్ ధరావత్ రామారావు, నాయకులు అంకిరెడ్డి కృష్ణారెడ్డి, మాలోత్ బోజ్యానాయక్, సారేపల్లి శేఖర్, సయ్యద్ సైదా, మచ్చా కుమార్, పసుపులేటి మంగయ్య, యాకూబ్ ఉన్నారు.

## చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

పాల్వంచ రూరల్, డిసెంబర్ 25: జగన్నాథపురానికి చెందిన ధర్మసోత్ విజయ్ (30) అనే కూలి కుటుంబ కలహాల నేపథ్యంలో ఈ నెల 15న పురుగు మందు తాగాడు. కుటుంబ సభ్యులు ఖమ్మంలోని ఒక ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించగా అక్కడ చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. విజయ్ మృతిపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## వరి కోతలు

జూలూరుపాడు, డిసెంబర్ 25: మండలంలో వరి కోతలు ముమ్మరంగా సాగుతున్నాయి. కూలీల కొరత ఏర్పడడంతో రైతులు యంత్రాలతో కోతలు చేపడుతున్నారు. కాకర్ల, జూలూరుపాడు, గుండెపుడి, మాచినేనిపేట, వినోభానగర్, పాపకొల్లు, కొత్తూరు, పడమట నర్సాపురం గ్రామాల్లోని 3 వేల ఎకరాల పరిధిలో జోరుగా కోతలు సాగుతున్నాయి. గతంలో ఎన్నడూ లేని విధంగా రైతలుఉ ఈ ఏడాది వరి సాగు చేపట్టారు. ఏటా పంట ఇంటి కొచ్చే సమయంలో అకాల వర్షం కురిసి పంట దెబ్బతిని దిగుబడి కాస్త తగ్గేది. ధాన్యం రంగు మారేది. మొలకలు వచ్చేవి. ఈసారి వాతావరణం అనుకూలించడంతో రైతులు మంచి లాభాలు వస్తాయని ఆశిస్తున్నారు. ప్రస్తుతం మండలవ్యాప్తంగా ఉన్న కల్లాల్లో వరి ధాన్యపు రాశులు కళకళలాడుతున్నాయి. ఇక ధాన్యం విక్రయ కేంద్రాల్లో దిగుబడి విక్రయించడమే తరువాయి.

## దాసాంజనేయునికి పూజలు

దుమ్ముగూడెం, డిసెంబర్ 25: ధనుర్మాసం సందర్భంగా మండల కేంద్రమైన లక్ష్మీనగరంలో దాసాంజనేయస్వామి ఆలయంలో శ్రీకృష్ణ గోదాదేవి అమ్మవారికి మహిళలు, భక్తులు సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ బాధ్యులు, అర్చకులు, భక్తులు, మహిళలు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి పరామర్శ

దమ్మపేట రూరల్, డిసెంబర్ 25: మండలంలోని మొద్దులగూడెం గ్రామానికి చెందిన ప్రముఖ వ్యాపారి బచ్చు సత్యనారాయణ కుమార్తె హైదరాబాద్‌లో ఆదివారం అనారోగ్యంతో మృతి చెందింది. విషయం తెలుసుకున్న అశ్వారావుపేట మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు ఆమె భౌతికకాయాన్ని సందర్శించి నివాళి అర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

## రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీల్లో వైష్ణవి ప్రతిభ

మణుగూరుటౌన్, డిసెంబర్ 25: రాష్ట్రస్థాయి పాఠశాలల అండర్–17 బాలికల క్రికెట్ పోటీల్లో మణుగూరు పట్టణానికి చెందిన విద్యార్థిని పోలెబోయిన వైష్ణవి ప్రతిభ చాటింది. సోమవారం ఖమ్మం, కరీంనగర్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్ మొదటి ఇన్నింగ్స్‌లో బ్యాటింగ్ చేసిన వైష్ణవి 50 పరుగులు చేసిన నాట్ అవుట్‌గా నిలిచింది.

# ఊరూరా క్రిస్మస్ ప్రార్థనలు

క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకుని సోమవారం భద్రాచలం, పినపాక, అశ్వారావుపే, ఇల్లెందు నియోజకవర్గాల్లో క్రైస్తవులు క్రిస్మస్ ప్రార్థనలు నిర్వహించారు. ఆదివారం అర్ధరాత్రి నుంచే ప్రార్థనలు ప్రారంభమయ్యాయి. ఫాదర్లు, పాస్టర్లు ఏసుక్రీస్తు జననం, క్రీస్తు లోకానికి చేసిన సేవలను వివరించారు. ప్రార్థనల అనంతరం క్రైస్తవులు ఒకరినొకరు ఆలింగనం చేసుకుని క్రిస్మస్ శుభాకాంక్షలు తెలుపుకొన్నారు. ప్రార్థనల్లో ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు. – నమస్తే నెట్‌వర్క్



బూర్గంపహాడ్‌లో కేక్ కటింగ్



చంద్రుగొండలో దైవ సందేశమిస్తున్న పాస్టర్



పినపాక: భూపాలపట్నం చర్చిలో పార్థన



పాల్వంచ రూరల్: ఉల్వనూరు చర్చిలో ప్రార్థన



అశ్వారావుపేట: అల్లిగూడెంలో కేక్ కోస్తున్న క్రైస్తవులు



కరకగూడెం:చిన్నారులతో కేక్ కటింగ్



టేకులపల్లి: కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే కోరం కనకయ్య



భద్రాచలం: సీఎస్ఐ చర్చిలో



చర్ల: ప్రార్థన చేస్తున్న క్రైస్తవులు



దుమ్ముగూడెం: లక్ష్మీనగరం చర్చిలో



జూలూరుపాడులో కేక్ కటింగ్